సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం : 11 : జనవరి : 2023



అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష గులాబీలతో అర్చన

నరసాపురం రూరల్: వేములదీవి వెంకటేశ్వర స్వామికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహించారు. పూజలో చామకూరి నాగేశ్వరరావు, సత్యవతి దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



అత్తిలి: ఈడూరులోని శ్రీవరాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రామ ప్రదక్షిణం, పవిత్ర సమర్పణ, తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

బరిలోకి దిగితే.. దున్నుడే!

- ఏలూరు రేంజ్‌లో 205 పందెం బరులు ధ్వంసం
- 9,500 మందిపై బైండోవర్ కేసులు
- కృష్ణా, గోదావరి లంక పరివాహక ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్
- జూదానికి బదులు సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం



ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో కోడి పందేల బరిని ధ్వంసం చేయిస్తున్న పోలీసు సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి జిల్లాలో సంక్రాంతి హడావుడి మొదలైంది. పందెంరాయుళ్ల బరులను సిద్ధం చేస్తున్నారు. అయితే పోలీసులు కూడా బరిలోకి దిగారు. నిత్యం పదుల సంఖ్యలో కోడి పందేల బరులు ధ్వంసం చేస్తున్నారు. వందల సంఖ్యలో బైండోవర్ కేసులు నమోదు చేస్తూ కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల్లో ఏలూరు రేంజ్‌లోని 6 జిల్లాల్లో పెద్ద ఎత్తున డ్రైవ్ కొనసాగుతుంది. ఇంతవరకు 9,500 బైండోవర్ కేసులు నమోదు చేసి 4,200కుపైగా కత్తులు స్వాధీనం చేసుకున్నారు. 205 పందెం బరులు ధ్వంసం చేశారు. కనుమ పండుగ రోజు వరకు పోలీసుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది.

ఆస్తులు జప్తు చేసేలా ఆదేశాలు

ప్రధానంగా గ్రామస్థాయి నుంచే జూదక్రీడల కట్టడికి పోలీసులు శ్రమిస్తున్నారు. అవగాహన సదస్సులకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రతి పోలీస్ జిల్లాలో ఆయా స్టేషన్ల పరిధిలోని ఎస్సూ, సీఐలతో పాటు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి డ్రైవ్ కొనసాగిస్తున్నారు. మొదటి సారిగా బైండోవర్ కేసులు నమోదైన వ్యక్తుల నుంచి రూ.5 లక్షల పూచీకత్తు తీసుకుంటున్నారు. బైండోవర్ కేసుల్లోని వ్యక్తులు మళ్ళీ జూదక్రీడలు నిర్వహిస్తే ఆర్ఆర్ యాక్ట్ ద్వారా ఆస్తులు జప్తు చేసేలా రేంజ్ డీఐజీ పాలరాజు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు 6 జిల్లాల్లో 9,500 బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఏలూరు జిల్లాలో 2,600, కృష్ణా జిల్లాలో 1,600, భీమవరంలో 2,800, కోనసీమలో 700, కాకినాడ జిల్లాలో 1,500 కేసులు, తూర్పు గోదావరి జిల్లాలో 300 కేసులు నమోదు చేశారు. కృష్ణా జిల్లాలో 30, ఏలూరు జిల్లాలో 60, భీమవరం జిల్లాలో 79, కోనసీమ జిల్లాలో 8, కాకినాడ జిల్లాలో 28 పందెం బరులు ధ్వంసం చేశారు. వీటితో పాటు ఆరు జిల్లాల పరిధిలో 4,200 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు.

సర్కిల్ వారీగా సంప్రదాయ క్రీడా పోటీలు

గడిచిన 15 రోజులుగా పేకాట, కోడిపందేలు నిర్వహించిన వారిపై మొత్తం 42 కేసులు నమోదు చేశారు. సబ్‌డివిజన్ల వారీగా క్రీడలకు శ్రీకారం చుట్టారు. గత మూడు రోజులుగా అన్ని పోలీస్ జిల్లాల్లో పోలీసుల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఒక్కొక్క సర్కిల్‌కు, ఒక్కొక్క క్రీడపై పోటీలు నిర్వహించి మూడు రోజులు పాటు కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఒక సబ్ డివిజన్ పరిధిలో వాలీబాల్, మరో సబ్ డివిజన్‌లో క్రికెట్ ఇలా అన్ని సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్నారు.

లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

మైదాన ప్రాంతాలతో పాటు లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఏలూరు రేంజ్ పరిధిలో కృష్ణా, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో పదుల సంఖ్యలో లంక గ్రామాలున్నాయి. పోలీసుల తాకిడి పెరిగిన నేపథ్యంలో లంక గ్రామాల్లో కూడా కోడిపందేలు జరుగవచ్చనే సమాచారంతో స్పెషల్ టీంలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది ద్వారానే ప్రాథమిక సమాచారం తెలుసుకునేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ మహిళా పోలీస్, సచివాలయంలోని పశుసంవర్ధక శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల పరిధిలో జరిగే సంక్రాంతి క్రీడలకు సంబంధించి ప్రతిరోజూ సమాచారం పంపేలా ఆదేశాలిచ్చారు. దీంతో పాటు ప్రత్యేక పార్టీలతో నిరంతరం డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

ప్రతి జిల్లాలో టోల్‌ఫ్రీ నెంబర్



గ్రామస్థాయి నుంచే జూద క్రీడలు కట్టడి చేసి సంప్రదాయ క్రీడల వైపు మళ్ళించేలా అన్ని చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా ఇంత వరకు 9,500 బైండోవర్ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదైనా పందేలు నిర్వహిస్తున్నవారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ చట్టం కింద కేసులు నమోదు చేసి ఆస్తులను జప్తు చేస్తాం. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ప్రతి రోజూ సమాచారం వస్తుంది. సమాచారానికి అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే సీరియస్‌గా పరిగణిస్తాం.

– జీ.పాలరాజు, డీఐజీ, ఏలూరు రేంజ్

క్రీడా పోటీలు అభినందనీయం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: యువతను మంచి మార్గం వైపునకు మళ్లించేందుకు క్రీడలు దోహదపడతాయని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఆటల పోటీలు ముగిశాయి. ఈ పోటీలలో 8 జట్లు పాల్గొనగా ఇరగవరం జట్టు ప్రథమ స్థానం సాధించింది. విజేతలకు మంత్రి కారుమూరి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పోలీసు వారు నిర్వహించిన ఈ ఆటలు పోటీలు ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠశాలలోని ఆటల మైదానాలను అభివృద్ధ చేస్తుందన్నారు. నియోజకవర్గంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి, బహుమతులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మనోహర ఆచారి, సీఐ సిహెచ్ ఆంజనేయులు, ఎస్సై కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



దిగమర్రులో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జేవీ మురళి

పాలకొల్లు అర్బన్: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. పాలకొల్లు మండలం దిగమర్రులోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను మంగళవారం జేసీ తనిఖీ చేశారు. భూముల మ్యాప్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం దిగమర్రు, కొత్తపేట, ఆగర్రు, బల్లిపాడు సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. సచివాలయానికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శన బోర్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ జి.మమ్మి, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం, సర్వే సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల్లో పతకాల పంట



ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించిన సూర్యహంసిని, సుహాస్

సాక్షి, భీమవరం: జాతీయ స్థాయి అండర్–14 విలువిద్య పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన మాదాల సూర్యహంసిని, సుహాస్ వివిధ పతకాలు గెల్చుకున్నారని ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ మంగళవారం చెప్పారు. ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో బాలికల విభాగంలో సూర్యహంసిని బంగారు, క్యాంస పతకాలు గెలుచుకుందని, మిక్స్‌డ్ డబుల్స్‌లో సుహాస్‌తో కలసి బంగారు పతకం, టీమ్ ఈవెంట్లో తనన్య, స్ఫూర్తితో కలసి రజత పతకం గెల్చుకున్నట్లు చెప్పారు. బాలుర వ్యక్తిగత విభాగంలో సుహాస్ బంగారు పతకంతోపాటు టీమ్ ఈవెంట్లో బంగారు పతకం సాధించాడని సత్యనారాయణ చెప్పారు. విజేతలను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు, కోచ్ కమల్‌కిషోర్ తదితరులు అభినందించారు.

12, 13 తేదీల్లో కబడ్డీ పోటీలు

ఆకివీడు: సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయిలో మహిళలు, పురుషులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనుమూరి ఆనంద వర్మ మంగళవారం చెప్పారు. మండలంలోని దుంపగడపలోని రైల్వే గేటు సమీపంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే పోటీలు సింథటిక్ మ్యాట్‌పై జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన టీంలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేలు, తృతీయ బహుమతి రూ. 15 వేలు అందజేస్తామని చెప్పారు.

పొరపాట్ల సవరణకు 20 వరకు అవకాశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే ఏప్రిల్‌లో జరిగే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల వివరాల్లో ఉన్న పొరపాట్లను బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో సరి చేయడానికి ఈ నెల 11 నుంచి 20 వరకూ అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల వివరాల్లో పొరపాట్లు ఏమైనా ఉంటే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా సరిచేయాలని సూచించారు.

ఉపాధి నిధుల మళ్లింపు వాస్తవమే

దెందులూరు: దెందులూరు మండలం జోగన్నపాలెంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి నిధులు జమ చేయడాన్ని గుర్తించామని మండల ఉపాధి ఏపీఓ దశరథ రాంజీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆరుగురి ఖాతాల్లో మొత్తం రూ.2,28,655 జమైందన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ఏపీఓ ధ్రువీకరించారు. నివేదికను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. నిధుల స్వాహాపై దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్‌సీపీ మండల నేత నిట్టా గంగరాజులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ప్రైవేట్ బ్యాంకు వద్ద ఆందోళన



జంగారెడ్డిగూడెం ప్రైవేట్ బ్యాంకు ప్రధాన ద్వారానికి అడ్డంగా కూర్చొని ఆందోళన చేస్తున్న బాధితులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేట్ బ్యాంకు వద్ద ఖాతాదారుల ఆందోళన రెండో రోజు కొనసాగింది. తమకు తెలియకుండా సొమ్మును తారుమారు చేశారని, తమ సొమ్ము ఇప్పించాలని కోరుతూ ఆందోళన చేశారు. డి.పాపాయమ్మ పేరిట 2017లో ఖాతా తెరిచారు. ఆ ఖాతాలో 15 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, రెండు సంవత్సరాల కాలపరిమితికి బ్యాంకు అధికారులు బాండ్ ఇచ్చారు. ఆ బాండ్ ఆటోమెటిక్ రెన్యువల్ అవుతుందని అధికారులు చెప్పారు. ఆ బాండ్‌ను క్లోజ్ చేసి సొమ్ము తీసుకుందామని వస్తే 2018లోనే అమౌంట్ తీసుకున్నట్లుగా స్టేట్‌మెంట్‌లో చూపిస్తుందని బ్యాంకు అధికారులు చెప్పారు. అయితే 2022 మే వరకు వడ్డీ చెల్లించడం గమనార్హం. దీనిపై ఫిర్యాదు చేయగా.. బ్యాంకు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పోలీస్ కంప్లయింట్ వద్దని, మీ సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నా, ఇంతవరకు పరిష్కరించలేదు. టి.నరసాపురం మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన కాల్నీడి సత్యనారాయణ పొలం రుణం తీసుకుని తర్వాత చెల్లించాడు. అయితే ఇంకా రుణం తీసుకున్నట్లు ఉందని, తనకు తెలియకుండానే తన పేరిట రుణం రీషెడ్యూల్ చేసి మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాద్రి నిర్మల్‌కుమార్ 2021లో 22 కాసులు బంగారం తనఖా పెట్టి రూ. 4.50 లక్షలు రుణం తీసుకున్నాడు. విడిపించుకుందామని వస్తే వస్తువులు లాకరులో ఉన్నాయని, సాంకేతిక సమస్య ఉందని తిప్పుతున్నారు.

అలసత్వం సహించను

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అర్హులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం సహించనని చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు హెచ్చరించారు. మంగళవారం నరసాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేసి అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు త్వరితగతిన అందేలా చూడాలన్నారు. పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సొంత స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గంలో మేజర్, మైనర్ డ్రెయిన్లు, ఏటిగట్ల విభాగంలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద పూడిక తీత పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. రాబోయే దాళ్వాకు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మైలా బత్తుల సోని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, తహసీల్దార్ ఫాజిల్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు వాహన తనిఖీలు



జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో డ్రైవర్లతో ఫేస్‌వాష్ చేయిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని, నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ఏలూరు జిల్లా పరిధిలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్‌తో పాటు, కైకలూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు, రాత్రివేళ వాహన చోదకులకు వాష్ అండ్ డ్రైవ్ చేయిస్తున్నామని తెలిపారు. నేరాలు అదుపు చేయడంతో పాటు అక్రమ రవాణా, రహదారి ప్రమాదాల నివారణకు దోహదం చేస్తాయన్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో సుమారుగా 1,880 కేసులు నమోదు చేశామని తెలిపారు. ప్రజలు ఇష్టారాజ్యంగా నిబంధనలు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లో హెల్మెట్ ధరించకుండా మోటారు సైకిల్ నడిపేవారిపై 1,119 కేసులు నమోదు చేయగా, లైసెన్సు లేకుండా వాహనం నడిపే వారిపై 233 కేసులు, వాహనాలకు బీమా లేనివారిపై 4 కేసులు, త్రిబుల్ రైడ్ చేసేవారిపై 38 కేసులు, అతివేగం, నిర్లక్ష్యంగా నడిపే వారిపై 6 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 14 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై 121 కేసులు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు.

భీమవరంలో బ్లడ్ బ్యాంక్

- ఇప్పటికే చేరుకున్న రూ.1.20 కోట్ల విలువైన పరికరాలు
- విరాళాలకు ముందుకొస్తున్న దాతలు, ఉద్యోగులు
- రాయలంలో బ్లడ్ బ్యాంకుకు భవనం ఏర్పాటు



భీమవరం రాయలంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు కోసం ఏర్పాటు చేస్తున్న భవనం



బ్లడ్ బ్యాంకు వచ్చిన పరికరాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంత వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఉండగా కొత్తగా జిల్లా ఏర్పడడంతో భీమవరంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు కలెక్టర్ పి.ప్రశాంతి చర్యలు తీసుకున్నారు. బ్లడ్ బ్యాంకు చైర్మన్‌గా ఎంఎస్‌వి శివరామభద్రరాజుతో పాటు 11 మంది కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు.

బ్లడ్ బ్యాంక్‌కు సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి రూ.1.20 కోట్ల పరికరాలు ఇప్పటికే రాయలంలోని బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు భవనానికి చేరుకున్నాయి. బ్లడ్ బ్యాంక్‌కు మౌలిక వసతులు, బ్లడ్ బ్యాంక్‌కు సంబంధించిన పరీక్ష ల్యాబ్‌లో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. త్వరలోనే బ్లడ్‌బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

విరాళాల వెల్లువ

బ్లడ్ బ్యాంక్‌కు విరాళాలు ఇచ్చేందుకు దాతలు, ఉద్యోగులు, సామాన్యులు ముందుకు వస్తున్నారు. ఇంత వరకూ రూ.8.80 లక్షల విరాళాలు వచ్చాయి. మరికొంత మంది ఉద్యోగులు తమ శాఖ ద్వారా రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త సీహెచ్ కృష్ణంరాజు రూ.5 లక్షలు, వీరవాసరం రెవెన్యూ ఉద్యోగులు రూ.2 లక్షలు, మొగల్తూరు విద్యాశాఖ ద్వారా రూ.1.80 లక్షలు అందచేశారు. 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ తాడేపల్లిగూడెం రూ.5 లక్షలు విలువ చేసే 62.5 కె.వి. జనరేటర్ బహూకరించారు. ఉపాధి హామీ పథకం ఉద్యోగులు రూ. 1.67 లక్షలు విరాళంగా ఇచ్చారు. జిల్లా కేంద్రంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ బ్లడ్ బ్యాంక్ 7 నియోజకవర్గాల పరిధిలో ఏ ప్రాంతానికైనా కేవలం 30 కిలోమీటర్ల లోపే ఉంటుంది. దాంతో అత్యవసర సమయంలో రక్తం సులువుగా అందించవచ్చు.

దాతలకు ప్రశంసలు

రెడ్‌క్రాస్‌కు విరాళాల ద్వారా రూ.2 లక్షలు సేకరించిన వారికి రెడ్‌క్రాస్ గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసా పత్రం అందిస్తారు. వ్యక్తిగతంగా రూ.5 లక్షలు అందించిన వారికి గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసా పత్రం అందిస్తారు. జీవిత సభ్యత్వం కింద రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది.

బ్లడ్ బ్యాంక్‌కు చేరుకున్న పరికరాలు

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం, ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ ఒకేసారి రక్తం నుంచి విడివిడిగా అందించే మిషన్ ఒకటి, -40 డిగ్రీలు, -80 డిగ్రీ స్టోరేజ్ 600 లీటర్ల ఫ్రిజ్‌లు రెండు, రెండు నుంచి 6 డిగ్రీల 300 లీటర్ల స్టోరేజి ఫ్రిజ్‌లు 2, 600 లీటర్ల ఫ్రిజ్ 1, పరీక్షలకు 4 మెషీన్లు.

జిల్లా ప్రజలకు మేలు



బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాలోని ప్రజలకు ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుంది. రక్తంతోపాటు ప్లేట్‌లెట్స్, ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు అందుబాటులో ఉంటాయి. బ్లడ్ బ్యాంక్‌లోని మౌలిక వసతులకు సంబంధించి దాతలు, ఉద్యోగులు విరాళాలు అందించడం అభినందనీయం. విరాళాలు అందించడానికి ముందుకు రావాలి.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

వేగంగా సాగుతున్న పనులు



రాయలంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ.1.20 కోట్ల విలువైన పరికరాలు చేరుకున్నాయి. కలెక్టర్ సూచనలు, సలహాల మేరకు పనులు వేగంగా పూర్తి చేసి బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎంఎస్‌వీ శివరామబద్రిరాజు, రెడ్‌క్రాస్ చైర్మన్

మావుళ్లమ్మ ఉత్సవాలకు ఆహ్వానం



మావుళ్లమ్మ ఉత్సవాలకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సాక్షి, భీమవరం: భీమవరంలో నిర్వహించే మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఉత్సవ కమిటీకి సూచించారు. ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు హాజరుకావాలంటూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను ఉత్సవ కమిటీ మంగళవారం ఆహ్వానించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉత్సవాలను భారీగా నిర్వహించాలని, ఉత్సవాలలో లోటుపాట్లు లేకుండా, భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకోడానికి వస్తుంటారని ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనం త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు తూటారపు ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ, రామాయణం గోవిందరావు, నరహరిశెట్టి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీవారి గ్రామోత్సవం



ఉభయ దేవేరులు, గోదాదేవితో తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవారికి మంగళవారం నిర్వహించిన గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అశ్వ, గజ సేవల నడుమ ఈ ఉత్సవం కనులపండువగా సాగింది. గ్రామోత్సవం అనంతరం ఆలయం వద్ద ఉన్న ధనుర్మాస మండపంలో స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే ఆలయంలో జరుగుతున్న ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం రాత్రి అట్టహాసంగా జరిగింది.

రాజన్న బాటలో.. రైతు సంక్షేమం దిశగా

- వైఎస్సార్ హయాంలో రైతు సేవా కేంద్రాల ఏర్పాటు
- టీడీపీ ప్రభుత్వంలో ఆదరణకు నోచుకోక మూతపడిన వైనం
- కేంద్రాల పునరుద్ధరణకు నడుంబిగించిన జగన్ సర్కార్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలానికో కేంద్రం

రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భావించి రైతు సంక్షేమం కోసం సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే బాటలో నేడు రైతులకు సేవలందించేందుకు జగన్ సర్కారు మరో అడుగు ముందుకు వేసి ఇప్పటికే గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతేకాక తాజాగా రైతులకు యంత్రాలను అందించేందుకు ప్రత్యేకంగా రైతు సేవా కేంద్రాలను కూడా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోనుంది. ఈ కేంద్రాల ఏర్పాటుతో నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకూ దోహదం కానుంది.



గతంలో నిర్వహించిన రైతు సేవా కేంద్రం (ఫైల్)

ఏలూరు (మెట్రో): ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలను 2005వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు వివిధ రకాల ఎరువులు, పురుగు మందులు అందించారు. 2015 సంవత్సరం వరకు ఈ సేవా కేంద్రాలు పనిచేశాయి. అనంతరం ఏర్పడిన రాష్ట్ర విభజన, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో మార్పులు రావడంతో రైతు సంక్షేమాన్ని అప్పటి పాలకులు నిర్లక్ష్యం చేయడంతో రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ప్రతి మండలంలో ఉండే రైతు సేవా కేంద్రాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి.

రైతులకు మరిన్ని సేవలు

ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్న వైఎస్ జగన్ సర్కారు మూతపడిన రైతు సేవా కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టింది. గతంలో ఈ సేవా కేంద్రాల ద్వారా అందించే రైతు ఉత్పత్తులకు మరిన్ని ఉత్పత్తులు జోడించి తద్వారా సేవా కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనుంది.

ఆగ్రోస్ ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే రైతు సేవా కేంద్రాల్లో సైతం ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు లభించడంతో పాటుగా రైతులకు అవసరమయ్యే యంత్రాలను కూడా అందించనుంది. అంతేకాక స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రొటోవేటర్లు, టార్పాలిన్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, పైవాన్ స్ప్రేయర్లు ఇలా ప్రతి ఒక్క యంత్రం నేరుగా కంపెనీ నుంచి రైతు సేవా కేంద్రానికి సరఫరా చేయించి తద్వారా రైతులకు మార్కెట్ ధర కంటే తక్కువగా, సబ్సిడీతో ఈ సేవా కేంద్రాల ద్వారా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

365 రోజులూ అందుబాటులో..

గతంలో కేవలం రబీ, ఖరీఫ్ సీజన్ల ఆరంభంలో మాత్రమే ఈ సేవా కేంద్రాల ద్వారా సేవలు అందించే విధానానికి స్వస్తి చెప్పి నూతనంగా ఏర్పాటు చేసే సేవా కేంద్రాలను 365 రోజులూ రైతులకు అందుబాటులో ఉంచనుంది. అంతేకాక ఈ కేంద్రాలలోనే యంత్రాల మరమ్మతులు సైతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం ఆయా కేంద్రాల్లో సరీ్వసింగ్ సౌకర్యం కల్పించనున్నారు.

యువతకు ఉపాధి, శిక్షణ

రైతులకు సేవలతో పాటుగా నూతనంగా ఏర్పాటు చేసే రైతు సేవా కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్పత్తులు విక్రయించిన అనంతరం వచ్చే సొమ్ములో కమీషన్ ప్రాతిపదికన కేంద్ర నిర్వాహకులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన యువతకు తిరుపతిలో 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

నిరుద్యోగులకు అవకాశం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే 48 మండలాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సేవలందించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు జిల్లా ఆగ్రోస్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జిల్లా మేనేజర్ 99480 76854 నంబర్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.

రైతులకు ఎంతో మేలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రస్తుతం రైతులకు అనేక సేవలు అందుతున్నాయి. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు సేవా కేంద్రాలను ప్రారంభించి రైతు సంక్షేమానికి పాటుపడ్డారు. ప్రస్తుతం ఈ రైతు సేవా కేంద్రాలను మరోమారు ప్రారంభించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఈ కేంద్రాలు ఏర్పాటుకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం.

– జాజుల కృష్ణయ్య,
మేనేజర్, ఏలూరు జిల్లా ఆగ్రోస్ సంస్థ

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.1.95 కోట్లు



చినవెంకన్న ఆలయంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీలను మంగళవారం లెక్కించగా, గడిచిన 21 రోజులకు స్వామివారికి నగదు రూపేణా రూ.1,95,55,063 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 307 గ్రాముల బంగారం, 7.010 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. అదేవిధంగా రద్దు అయిన పాత రూ.1,000, రూ.500ల నోట్లు ద్వారా రూ.7 వేలు లభించాయని ఈఓ వివరించారు.

శ్రీమావుళ్ళమ్మ హుండీ ఆదాయం రూ.26.17 లక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీలను మంగళవారం తెరిచి లెక్కించగా 40 రోజులకు గాను రూ.26,17,690 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి చెప్పారు. అలాగే బంగారం 28.500 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు లభించాయన్నారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు (నాగన్న బాబు), ధర్మకర్తలు ముత్యాల వెంకటరామారావు, చెల్లంకి నాగ శేషగిరి (గిరి), మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకట లక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, ఈఓలు తోట శ్రీనివాసరావు, అరుణకుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా సంతోషం



ఇరగవరం: తూర్పువిప్పర్రు శివారు నారాయణపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



పెనుగొండ (ఆచంట): ఆచంట వేమవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

బంగారుగూడెంలో కోడిపందేలపై దాడి

ఐదుగురి అరెస్టు, 530 కోడి కత్తుల స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట వంటి జూదక్రీడల జోలికి పోవద్దని యువతకు హితవు పలికారు. ఇప్పటికే భీమవరం సబ్ డివిజన్‌లో కోడిపందేల నిర్వాహకులు, కోడికత్తులు తయారీ, స్థలాలిస్తున్న దాదాపు 1100 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేశామన్నారు. సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు. కాగా, మంగళవారం ఉదయం తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ సీఐ మూర్తి, ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేశానన్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.650 నగదు, 530 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి, రూరల్, పెంటపాడు పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ, ఏఎస్సై పాలూరి దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీల విజేత 'కోనసీమ'



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



పోటీలలో పరుగులు పెడుతున్న ఓ ఎడ్ల జత

- జూనియర్ విభాగంలో తొలి రెండు స్థానాల్లో బాపట్ల, పశ్చిమ
- సంక్రాంతి సందర్భంగా గోపవరంలో ఉత్సాహంగా పోటీలు
- రాష్ట్రం నుంచి 35 ఎడ్ల జతలు హాజరు

కైకలూరు: రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు కైకలూరు నియోజకవర్గం గోపవరంలో మంగళవారం కోలాహలంగా జరిగాయి. దీపక్ నెక్స్‌జన్ సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు ఎడ్ల పరుగు పోటీలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఎడ్ల పోటీలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. సీనియర్ విభాగంలో మూడు కిలోమీటర్లు, జూనియర్ విభాగంలో రెండు కిలోమీటర్ల మేర పోటీలు జరిగాయి. జూనియర్ విభాగంలో 32 ఎడ్ల జతలు, సీనియర్ విభాగంలో మూడు ఎడ్ల జతలు పాల్గొన్నాయి. కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ, కొండ్రెడ్డి సూర్య ప్రభాకర్ సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, నెక్స్‌జన్ ఎండీ సుబ్రహ్మణ్యం, నారాయణ, వెంటక రమణ, మల్లేశ్వరరావు, అప్పారావు, రాజశేఖర్, శ్రీను, శేషు, వెంకటరాం తిలకించారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

విజేతలు ఇవే

సీనియర్స్ విభాగంలో నిర్దేశించిన లక్ష్యాన్ని 6 నిమిషాల 52 సెకన్లలో కొనసీమ జిల్లా గుమ్ములూరుకు చెందిన ఎడ్ల జత ఛేదించి విజేతగా నిలిచి రూ.30 వేల నగదు బహుమతి దక్కించుకుంది. కాకినాడ జిల్లా కట్టమూరు ఎద్దు రెండో స్థానంలో నిలిచి రూ.25 వేలు, ప్రకాశం, పమిడిపాడు ఎద్దు మూడో స్థానంలో నిలిచి రూ.20 వేలు నగదు బహుమతులు అందుకున్నాయి. జూనియర్ విభాగంలో బాపట్ల జిల్లా స్టువర్టుపురం ఎద్దు 4 నిముషాల 54 సెకన్లలో లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచి రూ.25 వేలు నగదు బహుమతి పొందాయి. రెండో స్థానం పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు రూ.20 వేలు, మూడో బహుమతి బాపట్ల జిల్లా పమిడిపాడు రూ.15 వేలు, నాల్గో, ఐదు బహుమతులను కాకినాడ జిల్లా గండేపల్లి ఎద్దు రూ.10 వేలు, రూ.8 వేలు సొంతం చేసుకున్నాయి.

సర్వోదయ మండలి జిల్లా అధ్యక్షురాలిగా మృదులకుమారి



చర్ల మృదులకుమారి

సాక్షి, భీమవరం: సర్వోదయ మండలి పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలిగా చర్ల మృదుల కుమారిని నియమిస్తూ రాష్ట్ర సర్వోదయ మండలి ఆదేశాలిచ్చినట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం చెప్పారు. ఇప్పటివరకు అధ్యక్షురాలిగా ఉన్న చర్ల విదులకుమారి మరణంతో ఆమె స్థానంలో మృదులకుమారిని నియమించామన్నారు. 1970 నుంచి మృదులకుమారి సర్వోదయ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి కారుమూరి సమక్షంలో భారీ చేరికలు



తిరుపతిపురం టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు తాళ్ల వెంకట సుబ్బారావు, ఆయన కుమారుడు తాళ్ల భ్రమరాజులను రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారు మూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వీరికి మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సరుకుల పంపిణీ

అత్తిలి: ఈడూరు గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు బింకం నరశింహారావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, పార్టీనాయకులు బింకం యోహాను, యాళ్ల హానోక్ కుమార్,ఇల్లూరి సంపదరావు, పొన్నమల్లి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఎరువులు అధికంగా వాడొద్దు

తాడేపల్లిగూడెం రూరల్: వరి చేలలో సల్ఫేడ్ ప్రభావం ఎక్కువగా ఉందని, ఎరువులు అధికంగా వాడొద్దని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని కృష్ణాయపాలెం, నందమూరు, జగన్నాథపురం గ్రామాల్లో ఆయన పర్యటించి, వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వరి చేలలో కనిపించేది కాండం తొలుచు కాదని, సల్ఫేడ్ ప్రభావమని స్పష్టం చేశారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండటం, మురుగు సరిగా బయటకు పోకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్న ప్రాంతాల్లో రైతులు ఎరువులు వాడొద్దని, నీరు బయటకు పోయే మార్గాలు చేసుకోవాలని, కొత్త నీరు పెట్టాలని, నేల ఎక్కువ ఆరేలా చూసుకోవాలని హితవు పలికారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షటిల్, ముగ్గుల పోటీలు

అత్తిలి: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో షటిల్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 14న షటిల్ డబుల్స్, 15న మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసామని చెప్పారు. ఈపోటీల్లో పాల్గొనే వారు అత్తిలి బ్యాంకువీధిలోగల శ్రీవరలక్ష్మీ బ్రాస్ అండ్ మెటల్ షాపులో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

18న ఉచిత మానసిక ఆరోగ్య వైద్య శిబిరం

అత్తిలి: ఈనెల 18న అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మానసిక ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ ఆర్ సురేఖ తెలిపారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో ఫిట్స్, మతిమరుపు, జీవితంపై విరక్తి, నిద్రపట్టకపోవడం, ఆత్మహత్యప్రయత్నాలు, కొత్తవారితో మాట్లాడాలంటే భయం, జబ్బులేకపోయినా ఉన్నదనేభావన, మద్యానికి బానిసకావడం, స్మోకింగ్, డ్రగ్స్ తదితర వ్యాధులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఉచితంగా మందులు అందజేస్తారని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం డాక్టర్ హన్న కోమలి తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ సోకిన చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన గౌతమి సాల్వెంట్ అధినేత మల్లిన రామచంద్రరావు అభినందనీయులని ఏఆర్టీ డిస్ట్రిక్ ప్రోగ్రామ్ మేనేజరు జె.శ్యామ్‌సన్ అన్నారు. తణుకు ఏఆర్టీ సెంటర్‌లో మంగళవారం దాత మల్లిన రామచంద్రరావు సౌజన్యంతో హెచ్‌ఐవీ సోకిన 30 మంది చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ జగదీష్, ఎయిడ్స్ ప్రీవెంటివ్ కంట్రోల్ యూనిట్ డిస్ట్రిక్ సూపర్‌వైజర్ హరనాథ్, దేవీ సీఫుడ్స్ మేనేజరు గూడపాటి వెంకట్రావు, ఏఆర్టీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌జీలో ఘనంగా హిందీభాషా దినోత్సవం

పెంటపాడు: రాజభాషగా గుర్తించే హిందీ బాషపై విద్యార్థులు పట్టు సాధించాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీభాషా దినోత్సవంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇరగవరం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖమాత్యులు కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు శివారు నారాయణపురంలో 67వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అవ్వతాతలతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ పథకాలను అందించే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ బ్రోచర్ అందించి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్లే నిర్భయంగా



నారాయణపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఉండగలుగుతున్నామని, ఆర్థిక భరోసా కలిగి జీవిస్తున్నామని ప్రజలు చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇటువంటి సీఎం దగ్గర మంత్రిగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. గ్రామంలోని రామాలయం నిర్మాణంలో ఉండగా దాని నిర్మాణం కోసం తక్షణమే మంత్రి తన సొంత నిధి నుంచి 8 లక్షల రూపాయలు మంజూరు చేసి మొదటి విడతగా ఈ నగదును అందజేస్తామన్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని డ్రైనేజి, రోడ్లులను నిర్మించాలని కోరడంతో అధికారులను పిలిపించి వాటి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పిల్లలు పెద్ద సంఖ్యలో రావడంతో వారికి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక, గోరుముద్ద ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ పంపల అంజిబాబు, సొసైటీ అధ్యక్షుడు పెద్దిరాజు, నాయకులు కోడే జోషి, మామిడి శెట్టి శ్రీను, గంటా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీలో సంక్రాంతి వేడుకలు

తణుకు టౌన్: తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకల్లో రోటరీ క్లబ్ ఆవరణలో సంక్రాంతి బోగి మంటలను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థులకు ముగ్గులు పోటీలు, వంటల పోటీలను, నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మల్లిన రామచంద్రరావు, కేటీవీ రెడ్డి, కే సత్యనారాయణరాజు, గమిని రాంబాబు, బసవ శ్రీదేవి, వంగూరి సుశీల, ఎస్ భారతి, పుట్టా లక్ష్మీ, ఎస్వీ శ్రీనివాసరావు, వంగూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

అత్తిలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేయడానికి ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలని తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. అత్తిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం ఎస్సీ నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పొట్ల సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికుయుక్తులు పన్నినా, జగన్‌మోహన్‌రెడ్డిని ఇంచు కూడా కదపలేరన్నారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరమైన స్థానాన్ని పదిలం చేసుకున్నారని పేర్కొన్నారు. జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అనైతిక రాజకీయ పరిణామాలు చూసి ప్రజలందరూ సిగ్గుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు నూకపెయ్యి రామకృష్ణ, ఎస్సీ నాయకులు ఇంజే రమేష్, ఈదూరి శ్యాంబాబు, బుంగా పద్మారావు, ఇల్లూరి సంపదరావు, రాయుడు ధర్మారావు, యాళ్ల సాధు సుందర్‌సింగ్, కోడెల్లి జయరాజు, తేలి సుందరరావు, బింకం యోహాను, పొన్నమళ్ల సంపదరావు, పాలవర్తి నాని తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పొట్ల సురేష్

బాస్కెట్‌బాల్ పోటీల్లో తణుకు విద్యార్థిని ప్రతిభ

తణుకు టౌన్: ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ అనకాపల్లిలోని ఏఎం ఎఎల్ కళాశాలలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి కళాశాల విద్యార్థులకు నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ డీ సౌజన్య జిల్లా జట్టు తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ బీహెచ్ హిమ బిందు తెలిపారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ బాస్కెట్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈసందర్భంగా విద్యార్థినీ సౌజన్యను కళాశాల పీడీ ఎం శ్రీనివాసరావును కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, కోశాధికారి నందిగం సుధాకర్, ఏవో డాక్టర్ డీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.



విద్యార్థినీ సౌజన్యను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

యువత జూదం జోలికి వెళ్లొద్దు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. కోడిపందేలు, గుండాట, పేకాట, కోతాట, చట్టవ్యతిరేక మద్యం అమ్మకాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, కోడిపందేల నిర్వహణకు రైతులు స్థలాలను ఇచ్చినా వారు కూడా శిక్షార్హులేనన్నారు. అత్తిలి మండలంలో ఏగ్రామంలోనైనా కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించడనికి ఏర్పాట్లు చేస్తే, సమాచారాన్ని గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ కార్యదర్శి, అత్తిలి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలపాలని తహసీల్దార్ కోరారు. సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడలను నిర్వహించుకుని పండుగను ఆనందోత్సాహల నడుమ జరుపుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డు లోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన 21 మందికి డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందచేశారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



తణుకులో ఆర్యవైశ్యుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆర్యవైశ్యులకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఆర్యవైశ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరివాడిగా ఎదిగారన్నారు. నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ..

అధ్యక్షుడిగా మానేపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా కొత్త సోమ సూర్య మాణిక్యాలరావు, కోశాధికారిగా మన్యం వెంకట అప్పారావు, ఉపాధ్యక్షులుగా మాజేటి హనుమద్‌ప్రసాద్, పచ్చిపులుసు శ్రీకృష్ణ రామలింగేశ్వరరావు, సహాయకార్యదర్శులుగా మానేపల్లి రామకిరణ్, గమిని రామచంద్రరావు, సహాయ కోశాధికారులుగా గూడూరి రామకృష్ణ, మాజేటి నరసింహారావు, పీఆర్వోలుగా జల్లూరి జగదీష్‌కుమార్, ఎస్‌వీఎస్ రామకృష్ణ, 20 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

నేడు పలు వాహనాలకు వేలం

తణుకు: తణుకు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మోటారు సైకిళ్లకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఈనెల 11న ఉదయం 10 గంటలకు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని సీఐ సూచించారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి వద్దనే రోగులకు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని 104 సేవల విభాగం డాక్టర్ పవన్ వర్మ అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ వర్మ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని ఎంపీయుపీ స్కూలు విద్యార్థులకు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ఆహార పదార్థాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.కృపావరం, హెచ్‌ఎస్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, వీహెచ్‌ఎస్ వసువులమ్మ, డీఈవో రత్నం, ఆశాలు పాల్గొన్నారు.



ఇంటి వద్దే వైద్యం పొందుతున్న వారికి ఆరోగ్య సూచనలు చేస్తున్న డాక్టర్ పవన్‌వర్మ

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

పెంటపాడు: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండలంలో అసాంఘీక నేరాలకు పాల్పడేవారిపై పూర్తి సమాచారం సేకరించాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు సిబ్బందిని కోరారు. పెంటపాడు మండలంలో అక్రమంగా కోడిపందేలు, జూదం, గుండాటలు నిర్వహించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం రెవెన్యూ ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కోడిపందేలకు సంబంధించి ఎవరివైనా భూములు చదును చేసి బరులు ఏర్పాటు చేయాలనుకొంటే చర్యలు తీసుకొంటామన్నారు. ఆర్ఐ కనకదుర్గ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కుటుంబసభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకోవాలని, సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వోలు, వీఆర్ఏలు మహిళా సంరక్షులతో పాటు, పెంటపాడు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలు, జూదం అరికట్టాలి

పెంటపాడు : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండలంలో ఏర్పాటు చేయబోయే జూదక్రీడలు, కోడిపందేలను తక్షణం అరికట్టాలని సీపీఐ మండల సమితి కోరింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కన్వీనర్ కళింగ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పెంటపాడు ఎస్సై జి. సత్యనారాయణకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. గుండాటలు, కోడికత్తులు కట్టేవారు, పేకాటలు, సాంప్రదాయం ముసుగులో చేసే చట్టవ్యతిరేక పనులను తక్షణం పోలీసులు ముందస్తుగా గుర్తించి అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బొడబళ్ల లక్ష్మినారాయణ, బందారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు ఎస్సై సత్యనారాయణకు జూదక్రీడలు అరికట్టాలని వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తణుకు అర్బన్: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. కదలిక లేని నీటినిల్వలు దోమల పుట్టుకకు నిలయాలని తెలిపారు. స్థానిక కొమ్మాయిచెర్వు గట్టు ప్రాంతంలో మంగళవారం దోమకాటు జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు మౌనిక, జె.శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్స్, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు

రైతుల సంక్షేమమే జగన్ ప్రభుత్వం ధ్యేయం

పెంటపాడులో వ్యవసాయ సలహామండలి ప్రమాణస్వీకారం

పెంటపాడు: రైతుల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు మండల వ్యవసాయ సలహామండలి పాలక వర్గ ప్రమాణస్వీకారం మంగళవారం పెంటపాడు మండల సమావేశమందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల ఉన్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పెట్టుబడి రాయితీ, కౌలురైతులకు రుణాలు, వ్యవసాయ పనిముట్లు, గ్రూపులకు రుణాలు తదితర పథకాల ద్వారా ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రతీ మండలంలోనూ సలహామండళ్లను ఏర్పాటు చేసి అధికారుల సాయంతో వ్యవసాయం పండగ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని తెలిపారు. రైతుల కష్టాలను ఎరిగిన సీఎంగా ప్రతీ రైతు జగనన్నకు రుణపడి ఉండాలన్నారు. పెంటపాడు మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షునిగా జట్లపాలెంకు చెందిన కట్టుబోయిన కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా మరో 6 గురు అయిన నల్లమిల్లి విజయానందరెడ్డి (పెంటపాడు), కునుకు పుల్లయ్య (బోడపాడు), బుద్దన ప్రసాద్ (ముదునూరు), గుండు మోగుల మునీంద్ర (దర్శిపర్రు), జాలపర్తి నాగేశ్వరరావు (ఆకుతీగపాడు), గోడే అనంతలక్ష్మి (కొండేపాడు), తాడి నాగబాస్కరరావు (యానాలపల్లి) లు డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో నూతన సభ్యులను పార్టీ నాయకులు గుండు మోగుల బలుసులు, ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మండా శివ, కొణతాల వెంకట్రావు, సొసైటీల చైర్మన్‌లు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ, ఏవో పార్థసారధి, తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో దామోదరరావు, మండల కార్యాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆయా గ్రామ పార్టీల నాయకులు తదితరులతో పాటు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొని నూతన మండలిని ప్రత్యేకంగా అభినందించారు.



పెంటపాడులో వ్యవసాయ సలహామండలి సభ్యులను అభినందిస్తున్న పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–వరేలా ద్వయం 6–3, 7–6 (7/4)తో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్–వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11–2, 5–11, 2–11, 5–11, 13–11, 11–9, 11–8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13–11, 11–9, 11–6, 11–8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–19, 21–14తో యంగ్ ఎన్గా టింగ్–యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12–21, 21–17, 14–21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10–21, 8–21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్–కృష్ణప్రసాద్ ద్వయం 10–21, 18–21తో కాంగ్ మిన్ హుక్–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 14–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్–జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్–త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి–గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలి షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.



కోహ్లి సెంచరీ అభివాదం

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.


20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–143, 2–173, 3–213, 4–303, 5–330, 6–362, 7–364. **బౌలింగ్:** కసున్ రజిత 10–0–88–3, మదుషంక 6–0–43–1, హసరంగ 10–0–67–0, కరుణరత్నే 8–0–54–1, దునిత్ 8–0–65–0, షనక 3–0–22–1, ధనంజయ 5–0–33–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–19, 2–23, 3–64, 4–136, 5–161, 6–178, 7–179, 8–206. **బౌలింగ్:** షమీ 9–0–67–1, సిరాజ్ 7–1–30–2, పాండ్యా 6–0–33–1, ఉమ్రాన్ 8–0–57–3, చహల్ 10–0–58–1, అక్షర్ 10–0–58–0.

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

- **రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?**

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

- **రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...**

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

- **'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..**

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

- **చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...**

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

- **ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?**

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

- **ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...**

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

- **'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?**

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

- **ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?**

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచి సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్‌ఆర్‌ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాథీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరపున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్‌ఆర్‌ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతార' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



- ఎస్ఎస్ తమన్

''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

- బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది.
- దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది.
- 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు.
- ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం



కశ్మీరా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.

నా కల తీరుతోంది



- సంతోష్ శోభన్

''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కళ్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.